ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ.15.12.2024 సమయం.13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. రాష్ట్ర శాసన సభ సమావేశాలు రేపు తిరిగి ప్రారంభమవుతాయి.
2. కాంగ్రెస్ పాలనలో ప్రజలు సంతోషంగా ఉన్నారని, ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేతలు అవాస్తవ విమర్శలు మానుకోవాలని పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ అన్నారు.
3. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద అర్హులను ఎంపిక చేసే ప్రక్రియను ప్రభుత్వం వేగవంతం చేసింది.
4. ఈ రోజు ప్రారంభమైన గ్రూప్-2 పరీక్షలకు నిమిషం ఆలస్యం నిబంధనను కట్టుదిట్టంగా అమలు చేస్తున్నారు.

------------------------------

**శాసన సభ**

తెలంగాణ శాసన సభ సమావేశాలు రేపు తిరిగి ప్రారంభమవుతాయి. ఈ నెల 9వ తేదీన ప్రారంభమైన సమావేశాలు తెలంగాణ తల్లి విగ్రహంపై ముఖ్యమంత్రి ప్రకటన అనంతరం రేపటికి వాయిదా పడిన విషయం తెలిసిందే.. ప్రభుత్వ రేపు రికార్డు ఆఫ్ రైట్స్ బిల్లును శాసన సభలో ప్రవేశపెడుతుందని భావిస్తున్నారు. అసెంబ్లీ ప్రారంభానికి ముందే మంత్రి వర్గం సమావేశమై ఈ బిల్లును ఆమోదించవచ్చని

సమాచారం. అలాగే పంచాయతీ రాజ్ సవరణ బిల్లును కూడా ప్రభుత్వం శాసన సభలో ప్రవేశపెట్టే అవకాశం ఉంది.

**డెస్క్**

---------------------------------

**పి సి సి**

కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ప్రజలు సంతోషంగా ఉన్నారని పి సి సి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. ఏడాది కాలంలో 54 వేలకు పైగా ఉద్యోగాలను భర్తీ చేసినట్లు ఆయన బి ఆర్ ఎస్ అధినేత చంద్రశేఖర్ రావుకు రాసిన బహిరంగ లేఖలో పేర్కొన్నారు. బి ఆర్ ఎస్ కుట్రలను తిప్పికొట్టి గ్రూప్ 1 పరీక్షలను నిర్వహించామని తెలిపారు. ఖరీఫ్ లో 153 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి కాంగ్రెస్ ప్రభుత్వ ఘనత అని పేర్కొన్నారు. 25 లక్షల మంది రైతులకు రుణమాఫీ చేయడాన్ని గర్వంగా భావిస్తున్నామని అన్నారు. మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టులో అవినీతి ఉందని తారక రామారావు చేస్తున్న ఆరోపణలు అవాస్తవమని, మూసీ కోసం అదనంగా ఎలాంటి వ్యయం చేయలేదని గుర్తించాలని మహేష్ కుమార్ గౌడ్ తమ లేఖలో పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై అర్ధరహిత మయిన విమర్శలు చేయకుండా కేటీఆర్, హరీష్ రావు,  కవితలను అదుపులో పెట్టాలని ఆయన కోరారు.

**(DESK)**

-----------------------------

**ఇందిరమ్మ**

ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద అర్హులను ఎంపిక చేసే ప్రక్రియను ప్రభుత్వం వేగవంతం చేసింది. ప్రజాపాలన కార్యక్రమంలో 80 లక్షలకు పైగా దరఖాస్తులు రాగా ప్రతి 500 దరఖాస్తులను ఒకరి చేత సర్వే చేయిస్తున్నారు. దరఖాస్తుదారుల ఇళ్లను వెళ్తున్న అధికారులు ఆ ఇళ్ల వారి వివరాలను యాప్ లో నమోదు చేస్తున్నారు, ఖాళీ స్థలం, ప్రస్తుతం ఉంటున్న ఇంటి ఫోటోలను అప్ లోడ్ చేస్తున్నారు. ఈ పథకం కింద ప్రతి ఇంటి నిర్మాణానికి 5 లక్షల రూపాయల సహాయాన్ని 4 విడతలుగా ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది.

**డెస్క్**

-------------------------

**జాతీయ లోక్ అదాలత్**

రాష్ట్ర వ్యాప్తంగా అన్ని స్థాయిల కోర్టుల్లో నిన్న నిర్వహించిన జాతీయ లోక్అదాలత్ విజయవంతమైనట్లు తెలంగాణ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సభ్య కార్యదర్శి సీహెచ్.పంచాక్షరి తెలిపారు. పెండింగ్‌లో ఉన్న సివిల్, క్రిమినల్ కేసులతోపాటు ప్రీలిటిగేషన్ కేసులు మొత్తం కలిపి 11.55 లక్షల కేసులు పరిష్కరించినట్లు ఆయన పేర్కొన్నారు. మొత్తం కేసుల్లో 161 కోట్ల రూపాయల పరిహారం అందజేశారు. హైకోర్టు సహా అన్ని స్థాయిల కోర్టుల్లో మొత్తం 337 స్పెషల్ బెంచ్‌లు కేసుల విచారణ చేపట్టాయి. హైకోర్టులో జస్టిస్ సూరేపల్లి నంద, రిటైర్డ్ జస్టిస్ జి.శ్రీదేవి ధర్మాసనాలు 225 కేసులు పరిష్కరించి, దాదాపు 16 కోట్ల రూపాయల పరిహారం అందజేశాయి.

**డెస్క్**

------------------------------

**లోక్ అదాలత్ - జిల్లాలు**

జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా నిన్న పలు జిల్లాలలో పలు సివిల్, క్రిమినల్ కేసులను పరిష్కరించారు. ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని న్యాయస్థానం భవన సముదాయంలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో రెండు వేల 964 కేసుల పరిష్కారం కింద 19లక్షల 26వేల మొత్తాన్ని అపరాధ రుసుము రూపంలో వసూలు చేసినట్లు జిల్లా జడ్జ్ ఎంవి రమేష్ తెలిపారు.

యాదాద్రి భువనగిరి జిల్లాలోని అన్ని కోర్టుల్లో కలిపి 5,582 కేసులు పరిష్కారమయ్యాయని, అందులో అందులో సివిల్ కేసులు 8, క్రిమినల్ కేసులు 2,128, ప్రీలిటిగేషన్ 56, ఈ చలాన కేసులు 3,390 కేసులు పరిష్కారం అయినట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జయరాజు తెలిపారు.

సంగారెడ్డి జిల్లా కోర్టులలో జరిగిన లోక్ అదాలత్ లో 5వేల 138 కేసులు పరిష్కారమయ్యాయి. జిల్లా ప్రధాన న్యాయమూర్తి భవాని చంద్ర, మొదటి సెషన్ జడ్జి కే .జయంతి, మూడో అదనపు సెషన్ జడ్జి జి సునీత రవీందర్ రెడ్డి, ప్రధాన సీనియర్ సివిల్ జడ్జ్ రవీంద్ర చౌహాన్ కేసుల తీర్పులు వెల్లడించారు.

రాజన్న సిరిసిల్ల జిల్లా కోర్టులో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ లో 7వేల 295 కేసులు పరిష్కారమైనట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రేమలత తెలిపారు.

**(PTCs)**

-------------------------------

**ఉపరాష్ట్రపతి- మెదక్**

మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం తునికి శివారులోని గ్రామీణ వికాస్ ఫౌండేషన్ ఏకలవ్య కృషి విజ్ఞాన కేంద్రాన్ని ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్కడ్  ఈ నెల 25 న సందర్శిస్తారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను కలెక్టర్ రాహుల్ రాజ్ పరిశీలించారు.సేంద్రియ విధానం ద్వారా సాగు చేస్తున్న పంటల వివరాలను కలెక్టర్ తెలుసుకున్నారు.

**(PTC-MDK)**

-----------------------------

**పటేల్ సీఎం**

భారత తొలి ఉప ప్రధాని ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ వర్ధంతి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. హైదరాబాద్ జూబ్లిహిల్స్ లోని తమ నివాసంలో సర్దార్ పటేల్ చిత్రపటానికి ముఖ్యమంత్రి పుష్పాంజాలి ఘటించారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కొండా సురేఖ కూడా సర్దార్ పటేల్ కు నివాళులర్పించారు.

**CMO**

--------------------------------------

**గ్రూప్ 2**

తెలంగాణలో గ్రూప్ 2 పరీక్షలు ప్రారంభమయ్యాయి. 783 గ్రూప్-2 సర్వీసుల పోస్టుల భర్తీకి ఈ రోజు,  రేపు జరుగుతున్న పరీక్షలకు పబ్లిక్ సర్వీస్ కమిషన్ పటిష్ఠమైన ఏర్పాట్లు చేసింది. నాలుగు పేపర్ లకు గాను మొదటి పేపర్ పరీక్ష ఈ ఉదయం పూర్తికాగా రెండో పేపర్ పరీక్ష మధ్యాహ్నం మూడు గంటలకు

మొదలవుతుంది. నిమిషం ఆలస్యం నిబంధనను ఖచ్చితంగా అమలు చేస్తున్నారు. హైదరాబాద్ లోని బేగంపేట్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన గ్రూప్ 2 పరీక్ష కేంద్రాన్ని టీజీపీఎస్సీ చైర్మన్ బుర్రా వెంకటేశం పరిశీలించారు. చాలా ఏళ్ల తరువాత గ్రూప్ 2 పరీక్ష నిర్వహిస్తున్నామన్నారు. అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు చేసినట్లు ఆయన చెప్పారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో ఆలస్యంగా వచ్చిన ఆరుగురుని పరీక్ష కేంద్రంలోకి అధికారులు అనుమతించలేదు. శ్రీ నవభారత్ డిగ్రీ కాలేజీలో ముగ్గురు, జాగృతి డిగ్రీ కాలేజీలో ఇద్దరు, ఎస్ ఎల్ ఎన్ ఎస్ డిగ్రీ కళాశాలలో ఒకరు ఆలస్యంగా వచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా 1,368 కేంద్రాలలో పరీక్షలు జరుగుతున్నాయి. పరీక్షా కేంద్రాల వద్ద 144 వ సెక్షన్ అమలు చేస్తున్నారు. 5లక్షల 51 వేల 943 మంది అభ్యర్థులు ఈ పరీక్షలకు దరఖాస్తు చేసుకున్నారు.

**డెస్క్/పీటీసీ**

----------------------------

**ప్రజావాణి**

తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్ 2 పరీక్షల నేపథ్యంలో రేపు పలు జిల్లాలలో ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేశారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి రేపు దరఖాస్తులతో కలెక్టరేట్ కార్యాలయానికి రావద్దని జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషషేక్ విజ్ఞప్తి చేశారు.కరీంనగర్ లో రేపు జరగాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు జిల్లాకలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు.

**(PTC-KNR/JGM)**

-------------------------------

**కామస్ మెనూ**

రాష్ట్ర ప్రభుత్వం పెంచిన డైట్ చార్జీలు, కాస్మోటిక్ చార్జీలతో రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థులకు సరైన పౌష్టికాహారాన్ని  అందించవచ్చని రాష్ట్ర ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్ ఉప కార్యదర్శి భవేశ్ మిశ్రా అన్నారు. పెంచిన డైట్ చార్జీలు, కామన్ మెనూ అమలులో భాగంగా నల్గొండ సమీపం లోని జీవీ గూడెం వద్ద ఉన్న బాలికల సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాల, కళాశాలలో రాష్ట్ర ప్రభుత్వం పెంచిన డైట్ చార్జీలు ,కామన్ మెనూ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు.

**(PTC)**

-------------------------------

**ఉచిత శిక్షణ**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో  ఔత్సాహిక నిరుద్యోగ యువకులకు జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సీసీటీవీ ఇన్స్టలైజేషన్లో భాగంగా సాఫ్ట్ స్కిల్స్, బేసిక్ కంప్యూటర్ పై 3 నెలలపాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా  ఎస్పీ అఖిల్ మహాజన్  తెలిపారు. ఆసక్తి ఉన్నవారు సంబంధిత పోలీస్ స్టేషన్ లలో పేరు నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు.

**(PTC)**

-----------------------------

**బేస్ బాల్**

ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని టీజీ బాలుర పాఠశాలలో ఎల్లుండి సీఎం కప్ బేస్ బాల్ జిల్లాస్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్టు జిల్లా క్రీడల అధికారి రమాదేవి తెలిపారు. ఇందులో ఎంపికైన వారు ఈనెల 18 నుండి 21 వరకు నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలో పాల్గొంటారని చెప్పారు.

**(PTC-ASFB)**

----------------------------

**చలి**

తెలంగాణను చలి వణికిస్తోంది. పలు చోట్ల అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. సాయంత్రం 6 గంటల నుంచి మరునాడు ఉదయం 9 గంటల వరకు చలి ప్రభావం కనబడుతోంది. కాగా ఇవాళా బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉన్నందున వచ్చేరెండు రోజుల్లో చలి తీవ్రత కొంత తగ్గవచ్చని వాతావరణ కేంద్రం తెలిపింది.

**డెస్క్**

-------------------------------